క్లుప్తంగా

భూబదలాయింపుపై రాజకీయం చేయొద్దు

రామచంద్రపురం: పట్టణంలోని శివాలయం భూమి బదలాయింపుపై రాజకీయం చేయవద్దని ట్రస్ట్‌బోర్డ్ మాజీ చైర్మన్, ఆలయ అభివృద్ధి కమిటీ నాయకుడు నేదునూరి ప్రసాద్, చాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షుడు నల్లమిల్లి జనార్దన్‌రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కోట వెంకట రమణ, స్థానిక కౌన్సిలర్ వాడ్రేవు సాయిప్రసాద్ తదితరులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయానికి చెందిన 1.80 సెంట్ల భూమికి బదులుగా సుమారు 3 ఎకరాలు ఇప్పించాల్సిందిగా రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. పట్టణ వ్యాప్తంగా పెరిగిపోతున్న మురుగునీటిని శుద్ధి చేసి, పట్టణ పరిసర ప్రాంతాలకు మంచినీటిని అందించేందుకు ప్రభుత్వం ఈ భూ బదలాయింపు చేస్తోందని తెలిపారు. పట్టణాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని సహకరించాలని వారు కోరారు.

ముగిసిన సప్తాహం



హోమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయం వద్ద నిర్వహిస్తున్న 6వ శ్రీరామనామ సప్తాహ మహోత్సవం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా పూర్ణాహుతి, సీతారాముల శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. సప్తాహం నిర్వహించిన ప్రసన్నాంజనేయ బాలభక్త సమాజం సభ్యులను, భజన బృందాలను, సహకరించిన దాతలను ఎమ్మెల్సీ త్రిమూర్తులు అభినందించారు.

పట్టణాభివృద్ధికి ప్రాధాన్యం



భూమిపూజ చేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యమిస్తూ ప్రజావసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. 16వ వార్డులో కౌన్సిలర్ మెండు బాపిరాజు అధ్యక్షతన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.29 లక్షలతో చేపట్టే సీసీ రోడ్ల పనులకు ఆమె గురువారం భూమి పూజ చేశారు. రామచంద్రుడు పంట కాలువలో పూడికతీత పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజావసరాలను గుర్తించి, ప్రభుత్వం ఇస్తున్న ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలవాలని చైర్‌పర్సన్ దుర్గారాణి కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, విప్ పోతంశెట్టి ప్రసాద్, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీఖాన్‌బాబా, అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు కొవ్వాడ బేబీ, పిల్లి శ్రీనివాస్, మారిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళా డెయిరీ సంఘం ఏర్పాటు

రామచంద్రపురం రూరల్: జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా అమూల్ సంస్థ సహకారంతో వెంకటాయపాలెంలో గురువారం మహిళా డైరీ సంఘం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో సర్పంచ్ యల్లమిల్లి సతీష్‌కుమారి మాట్లాడుతూ, మహిళా రైతులు ఆర్థికంగా ఎదిగే విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న పాలవెల్లువ పథకం అమలు చేస్తున్నారన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ పథకం గురించి మండల పశు వైద్యాధికారి మేడిశెట్టి కృష్ణార్జున వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.షెలత్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అమూల్యం

- ఆదర్శవంతం వైద్యుల సేవలు
- పేదల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టి
- రేపు జాతీయ వైద్యుల దినోత్సవం



అంగరలో ఇంటికెళ్లి రోగిని పరిశీలిస్తున్న వైద్యాధికారి పి.రత్నకుమారి

కపిలేశ్వరపురం: వైద్యో నారాయణో హరి అంటూ వైద్యుడిని దేవుడిగా కొలుస్తారు. మనిషి ఆరోగ్యంగా ఉన్నప్పుడే సంతోషం, సంపద ఉంటాయి. అనారోగ్యం పాలైనప్పుడు అంతా అతలాకుతలమవుతుంది. ఆ సమయంలో వైద్యులు సేవలందించి ఆరోగ్యాన్ని బాగుజేస్తారు. మనకు జీవితాన్ని ప్రసాదిస్తారు. అటువంటి గొప్ప సేవలందిస్తున్న వైద్యులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంది. రేపు జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా ఈ కథనం...

వైద్య రంగాన్ని పటిష్టపరుస్తున్న ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యరంగాన్ని పటిష్టపరుస్తోంది. గ్రామాల్లో ఉచిత వైద్య సేవలను అందిస్తోంది. గతంలో పీహెచ్‌సీకి ఒక్కరే డాక్టరు ఉండేవారు. ప్రస్తుతం ఇద్దరు చొప్పున వైద్యులను నియమించింది. గతంలో పీహెచ్‌సీకి వచ్చిన వారికి మాత్రమే వైద్యం చేసేవారు. 2 వేల మంది జనాభాకు ఒక విలేజ్ క్లినిక్ కేంద్రంగా 2023 ఏప్రిల్ 6 నుంచి ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా రోగుల ఇంటికి వెళ్లి వైద్యసేవలందిస్తున్నారు. పూర్తి స్థాయి సొంత భవనాలతో విలేజి క్లినిక్‌లను ఏర్పాటు చేస్తున్నారు. కంటి వెలుగు పథకం పేరుతో వైద్యులు, చిన్నారులకు కంటి పరీక్షలను చేసి ఉచితంగా కళ్లజోళ్లను అందిస్తోంది.

రెండు నియోజకవర్గాల్లో వైద్యులిలా..

రామచంద్రపురం నియోజకవర్గంలో తొమ్మిది పీహెచ్‌సీలుండగా 15 మంది వైద్యులున్నారు. మండపేట నియోజకవర్గంలో ఏడు పీహెచ్‌సీలుండగా 15 మంది వైద్యులు సేవలందిస్తున్నారు. వారంతా ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ఫ్యామిలీ డాక్టర్‌లో భాగంగా పీహెచ్‌సీల నిర్వహణతో పాటు ఆసుపత్రికి రాలేని వృద్ధులు, వికలాంగులు, బాలింతలు, గర్భిణుల ఇళ్లకు వెళ్లి సేవలందిస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పిస్తూ, ఉచితంగా మందులందిస్తున్నారు. రామచంద్రపురం, ద్రాక్షారామ, మండపేట, రాయవరంలలో ప్రైవేటు రంగంలో వైద్యులు విశేష సేవలందిస్తున్నారు. 120 గ్రామాల్లో అనేక మంది పీఎంపీలు క్షేత్ర స్థాయిలో వారి పరిమితిల్లో వైద్య సేవలందిస్తున్నారు.

డాక్టర్స్ డే నేపథ్యమిదీ..

ప్రజలకు విశేష సేవలందించిన ప్రముఖ వైద్యులు, బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ బీసీ రాయ్ గౌరవార్థం ఆయన పుట్టిన రోజైన జూలై ఒకటిన జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకొంటారు. 1882 జూలై 1న జన్మించిన బీసీరాయ్ 1962లో అదే రోజున తుది శ్వాస విడిచారు. ఆయన సేవలకు గుర్తుగా 1991 జూలై 1 నుంచి జాతీయ వైద్యుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నారు.

వైద్య వృత్తి సామాజికమైంది



వ్యాధి ప్రకృతి సిద్ధమైనది. దాని నిర్మూలనా, అదుపు తదితరమైనవన్నీ సామాజికమైనవి. వైద్య వృత్తిని సామాజిక బాధ్యతగా చేసినప్పుడు సంతృప్తి కలుగుతుంది. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేద, మధ్య తరగతి రోగులు వైద్యం కోసం వస్తారు. వారికి చికిత్స చేయడం సంతృప్తినిస్తోంది.

– డాక్టర్ టీఎస్ఎస్ సందీప్ నాయుడు, ద్రాక్షారామ పీహెచ్‌సీ వైద్యులు

బాధ్యతగా ఉంటా



గతేడాది హైదరాబాద్‌లో వైద్య విద్యను పూర్తి చేసుకున్నాను. ప్రస్తుతం హౌస్‌సర్జన్ విధులు నిర్వహిస్తున్నాను. వైద్య వృత్తిలో ఉండాలని చిన్నప్పటి నుంచి ఉంది. అమ్మానాన్నా ప్రోత్సాహం నన్ను డాక్టర్‌ని చేసింది. ఉత్తమ సేవలందించేందుకు జీవితాంతం కృషి చేస్తాను. వృత్తిలో ఎంతో బాధ్యతగా ఉంటాను.

– ముక్కపాటి రమ్య, వెలగతోడు, మండపేట మండలం

అవగాహనతో ఆరోగ్య పరిరక్షణ



ప్రకృతి శక్తులపైనా, సామాజిక స్థితిగతులపైనా అవగాహన పెంచుకోవడం ద్వారా చాలా వరకూ మానసిక సమస్యలను పరిష్కరించుకోవచ్చు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలి. అప్పుడే అనారోగ్యానికి దూరంగా ఉంటారు. వైద్యుల సలహాలు పాటించాలి.

– డాక్టర్ చల్లా రవికుమార్, హోమియో వైద్యులు, మండపేట

ఎంతో సంతృప్తి



పీఎంపీగా క్షేత్ర స్థాయిలో ప్రాథమిక వైద్య సేవలందించడం సంతృప్తినిస్తోంది. సీనియర్ వైద్యులు తరచూ నిర్వహించే ఆరోగ్య సదస్సులకు హాజరవుతూ చికిత్స పద్ధతులను తెలుసుకుంటుంటాను. వాటిపై అవగాహన పెంచుకొని ప్రజలకు సేవలందిస్తున్నాను.

– సూరంపూడి భద్రరావు, పీఎంపీ వైద్యులు, టేకి

1 నుంచి జగనన్న సురక్ష

రామచంద్రపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా వచ్చే నెల ఒకటో తేదీ నుంచి మున్సిపాలిటీ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి వార్డు సచివాలయంలో ప్రజాప్రతినిధుల సమక్షంలో సిబ్బంది, వలంటీర్లతో ప్రభుత్వం సూచించిన 11 రకాల ధ్రువపత్రాలను ప్రజలకు అందిస్తామని తెలిపారు. వీటిని పొందటంలో అర్హులు పొందుతున్న సమస్యలను గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్, ఆదాయం, జనన, మరణ, వివాహ తదితర సర్టిఫికెట్లు, మ్యుటేషన్లు, ఎఫ్ఎంసీ, కౌలు రైతు కార్డులు, ఆధార్ సేవలు, కొత్త రైస్ కార్డులు, హౌస్ హోల్డ్ మ్యాపింగ్ విభజన సరిఫికెట్లు ఉచితంగా జారీ చేస్తామని, దీనిని ప్రజలు వినియోగించుకోవాలని కమిషనర్ కోరారు.

ఇదీ షెడ్యూల్

తేదీ	ప్రాంతం (వార్డులు)
జూలై 1	కొత్తూరు (1, 2)
3	కుమ్మర్ల వీధి (3, 4, 24)
5	వైఎస్ఆర్ నగర్ (5, 6)
7	గంగుమళ్ల వారి వీధి (7, 8, 9)
10	బ్రాడీపేట–1 (10, 11)
12	బ్రాడీపేట–2 (12, 13)
14	చప్పిడివారి సావరం (14, 15, 16)
17	ముచ్చిమిల్లి (17, 18)
19	హౌసింగ్ బోర్డు కాలనీ (19, 20, 21)
21	రామకృష్ణ సెంటర్ (22, 23)
24	గుల్లవారిపేట (26, 27)
26	చాకలిపేట (25, 28)

జగనన్న పాలనలో దళారీ వ్యవస్థకు చెల్లుచీటి

- అత్యంత పారదర్శకంగా సంక్షేమ పథకాలు : మంత్రి వేణు
- కుయ్యేరు గడప గడపకూ మన ప్రభుత్వం



కుయ్యేరు శివారు చింతలంకలో వృద్ధురాలికి ప్రభుత్వం నుంచి వచ్చిన లబ్ధిని వివరిస్తున్న మంత్రి వేణు

కాజులూరు: సంక్షేమ పథకాలను అత్యంత పారదర్శకంగా అమలు చేస్తూ.. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పాతుకుపోయిన దళారీ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెల్లుచీటీ పలికారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. కుయ్యేరు శివారు చలివేంద్రపాడు, రేగుబాడవలలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ పిల్లి కృష్ణమూర్తి, ఎంపీటీసీ సభ్యుడు చీకట్ల సత్యనారాయణ ఆధ్వర్యాన వలంటీర్లు, కార్యకర్తలతో కలిసి మంత్రి ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరినీ పలకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిదీ ఆరా తీశారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ, గత పాలనలో అరకొరగా వచ్చే ప్రభుత్వ పథకాలను సైతం జన్మభూమి కమిటీ సిఫారసుల మేరకు టీడీపీ కార్యకర్తలకే ఇచ్చేవారని గుర్తు చేశారు. సామాన్యులకు న్యాయం జరగాలంటే దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. దీనికి భిన్నంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. కులమత రాజకీయ వివక్ష లేకుండా ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా వివిధ పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లోనే జమ చేస్తున్నారని అన్నారు. వలంటీర్ల ద్వారా అవ్వాతాతలకు, వికలాంగులకు నేరుగా వారి ఇళ్ల వద్దనే పింఛన్లు అందిస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి 21 రోజుల వ్యవధిలో సొమ్ములు జమ చేయడంతో రైతులను నిలువు దోపిడీ చేసే దళారులకు చుక్కెదురైందని చెప్పారు. దేశం మొత్తం మీద ఇంత భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను మంత్రి వేణుగోపాలకృష్ణ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాత భారతి మురళి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ మండల కన్వీనర్ గుబ్బల ఏసురాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు, వైస్ ఎంపీపీ పెదిరెడ్డి వెంకటరమణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, మండల గృహ సారథుల కమిటీ చైర్మన్ చింతపల్లి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- సోమేశ్వరంలో గడప గడపకూ మన ప్రభుత్వం



సోమేశ్వరం గ్రామస్తులకు పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

రాయవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి, అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. సోమేశ్వరంలో బుధవారం రెండోరోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సర్పంచ్ ఆరిఫ్, జెడ్పీటీసీ నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవ రెడ్డి, మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావులతో కలిసి నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామంలో సమస్యలను తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. తమది పేద ప్రజలకు మేలు చేసే ప్రభుత్వమన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను త్రిమూర్తులు, సర్పంచ్ ఆరిఫ్ ప్రారంభించారు. పలు చోట్ల ప్రజలు ఎమ్మెల్సీ త్రిమూర్తులకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణాదేవి, మండల కాపు సంఘం నేత నున్న వెంకటరమణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాపారాయుడు పుట్టిన రోజు వేడుకలు



వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకుల సమక్షంలో జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న పాపారాయుడు

మండపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయం నుంచి కోలుకున్న వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు, కామత్ గ్రూప్ అధినేత కర్రి పాపారాయుడు పుట్టిన రోజును గురువారం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, పార్టీ నేత పలివెల సుధాకర్, మండపేట పట్టణ, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కలిసి ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు, బాలింతలకు, అంధుల పాఠశాలలో విద్యార్థులకు పండ్లు, బ్రెడ్లు పంచారు. ఆదర్శ హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థలో పేదలకు అన్నదానం చేశారు. అనతంరం కామత్ ఆర్కేడ్‌లో నిర్వహించిన వేడుకల్లో పాపారాయుడు పాల్గొని కేక్ కట్ చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నేతలు అధిక సంఖ్యలో అర్తమూరులోని ఆయన స్వగృహం వద్దకు వెళ్లి పాపారాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సర్పంచులు మట్టపర్తి గోవిందరాజులు, పిల్లా వెంకటలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు చోల్లంగి రామారావు, పంపన లక్ష్మి, అడబాల శ్రీదేవి, కౌన్సిలర్లు పిల్లి శ్రీనివాస్, మందపల్లి రవికుమార్, యర్రగుంట సౌజన్య, పార్టీ నాయకులు ముక్కా సుబ్రహ్మణ్యం, వల్లూరి రామకృష్ణ, ప్రసాద్, సూర్యభాస్కరరావు, శివభగవాన్, రవి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న గృహసారథుల మండల ఇన్‌చార్జిల వీరే..

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ సీపీ జేసీఎస్ మండల ఇన్‌చార్జిలను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపాలిటీ, నగర పంచాయతీ, మండలాలకు జేసీఎస్ ఇన్‌చార్జిలను నియమించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వారి వివరాలు..

మండపేట

పాలంగి శ్రీనివాస్ (కపిలేశ్వరపురం), బండెల సత్య సాయిరాం (మండపేట రూరల్), యర్రమాటి వెంకన్న (మండపేట మున్సిపాలిటీ), తమలంపూడి వీర వెంకట సత్యనారాయణ (రాయవరం).

రామచంద్రపురం

తోకల శ్రీనివాస్ (కె.గంగవరం), సీహెచ్ నాగేంద్ర ప్రసాద్ (కాజులూరు), పలివెల నాగరాజు (రామచంద్రపురం రూరల్), సూరంపూడి సుబ్రహ్మణ్యం (రామచంద్రపురం మున్సిపాలిటీ).

ఏకలవ్య జయంతి



ఏకలవ్య జయంతి నిర్వహిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

మండపేట: ఎరుకుల సామాజికవర్గీయుల ఆరాధ్యదైవం ఏకలవ్యుని జయంతిని గురువారం పట్టణ ఎరుకుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సంఘ పట్టణ, మండల అధ్యక్షులు అమలదాసు రుద్రమూర్తి, సమతం పాపారావు ఆధ్వర్యంలో స్థానిక 26వ వార్డులో జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏకలవ్యుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, అమలదాసు లక్ష్మి, సంఘ నాయకులు అమలదాసు దుర్గాప్రసాద్, పోశయ్య, సింగం రాంబాబు, రమణ, సూర్యనారాయణ, మనుపూడి పాండవులు, గోపి సూర్యనారాయణ, సహదేవుడు, భీముడు, రామకృష్ణ, సత్తిబాబు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గ ఎరుకల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన ద్రాక్షారామ బోస్ బొమ్మ సెంటర్‌లో గురువారం ఏకలవ్య జయంతి ఘనంగా నిర్వహించారు. సంఘం సభ్యులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు భారతి నాగబాబు, ఉపాధ్యక్షుడు మాచగిరి చంద్రరావు, కార్యదర్శి అమలదాసు కాటమరాజు, కోశాధికారి గాడా చిట్టిబాబు, ప్రజా సంఘాల నాయకులు వెంట పల్లి రామకృష్ణ, గుబ్బల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మండపేట: తొలి ఏకాదశి పర్వదినాన్ని గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయం, జనార్దన స్వామివారి ఆలయాలు, మండలంలోని ద్వారపూడి, కేశవరం, ఏడిద, వెలగతోడు, అర్తమూరు తదితర గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి వారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పట్టణంలోని సీతారామక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ చైర్మన్ మల్లిపూడి గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సీతారామచంద్రమూర్తి స్వామివార్ల ఉత్సవ విగ్రహాలకు పంచామృతాభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయ ప్రాంగణంలోని సాయినాథుని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 350 మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు మల్లిపూడి వెంకటేశ్వరరావు కుమార్తె సుష్మ, అల్లుడు ఫణీంద్ర కుమార్ దంపతులు 100 మంది పేద మహిళలకు చీరలు పంచారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: తొలి ఏకాదశి సందర్భంగా అంగర, వెదురుమూడి, వల్లూరు, కాలేరు, నల్లూరు తదితర గ్రామాల్లోని వేణుగోపాలస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

రాయవరం మండలంలో...

రాయవరం: అన్ని ఏకాదశుల్లోకీ తొలి ఏకాదశి ఉత్తమమైనదని వెదురుపాక విజయదుర్గా పీఠాధిపతి వాడ్రేవు వెంకట సుబ్రహ్మణ్యం (గాడ్) అన్నారు. పీఠంలో తొలి ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులనుద్దేశించి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. పీఠం భక్తులతో సందడిగా మారింది. విజయదుర్గా అమ్మవారు, విజయ వేంకటేశ్వర స్వామి వారిని నయనానందకరంగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. మండలంలోని ఆలయాలు వేకువజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. సోమేశ్వరం శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్



రాయవరం మండలం వెదురుపాక మసీద్‌లో బక్రీద్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



చేదువాడ మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాయవరం: విలువలకూ, త్యాగానికీ ప్రతీక బక్రీద్ పర్వదినం అని పలువురు ముస్లింలు మత పెద్దలు పేర్కొన్నారు. మండలంలో ముస్లింలు గురువారం బక్రీద్ పండగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. సర్వమానవాళికి అల్లా బోధనలు అనుసరణీయమని మస్జిద్-ఎ-ఖయ్యత్ ఇమామ్ ఇమామ్ తౌసిఫ్ రజా అన్నారు. బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయన ముస్లిం సోదరులకు దైవ సందేశాన్ని ఇచ్చారు. అల్లా సూచించిన విధంగా ప్రతీ ఒక్కరూ తమకు కలిగిన సంపదలో కొంత పేదవారికి ఇవ్వాలన్నారు. ప్రతి ముస్లిం ఇస్లాం పంచసూత్రాలైన అల్లాపై విశ్వాసం(ఇమాన్), ప్రార్థన(నమాజ్), ఉపవాసం(రోజా), దానం(జకాత్), మక్కాయాత్ర(హజ్)లను పాటించాలన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని వెదురుపాకలోని మసీద్-ఇ-ఖయ్యత్‌లో ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని తమ సంతోషాన్ని పంచుకున్నారు. మండలంలోని లొల్ల, రాయవరం, పసలపూడి, చెల్లూరు గ్రామాల్లో కూడా బక్రీద్ వేడుకలను ముస్లింలు ఘనంగా జరుపుకొన్నారు.

ఘనంగా బక్రీద్

కాజులూరు: మండలంలోని చేదువాడ, కాజులూరుల్లో గురువారం బక్రీద్ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని మసీదులను సుందరంగా అలంకరించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ముస్లింలు మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇళ్లకు వెళ్లి పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఇబ్రహీం ప్రవక్త అల్లాపై చూపిన ప్రగాఢ విశ్వాసానికి, త్యాగానికి ప్రతీకగా ఏటా ఈ పండగ నిర్వహిస్తామని చేదువాడ అంజుమన్ కమిటీ సభ్యులు ఎం.రజాహుసేన్ (షాజహాన్) తెలిపారు.

కపిలేశ్వరపురంలో..

కపిలేశ్వరపురం: బక్రీదు పేరుతో జరుపుకునే ఈదుల్ అజ్‌హ త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే ఒక పవిత్ర కార్యక్రమమని మస్జిద్-ఎ-ఇబ్రహీమ ముతవల్లి మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, ఇమామ్ మౌలానా మహ్మద్ నాజీం అక్తర్ అన్నారు. అంగర మసీదులో గురువారం బక్రీద్ ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు. ముతవలి అబ్బాస్ హుస్సేన్, ఇమాన్ నాజీం అక్తర్ మాట్లాడుతూ హజ్రత్ ఇబ్రహీం అలైహిస్సలాం, ఇస్మాయిల్ అలైహిస్సలాం విశ్వాసం, త్యాగనిరతికి నిదర్శనంగా బక్రీదును జరుపుకుంటున్నామన్నారు. అంగర, పడమర ఖండ్రిక తదితర గ్రామాల ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు.